క్లుప్తంగా

విద్యార్థికి ఆర్థిక సాయం



అచ్చంపేట: పేద విద్యార్థికి స్నేహహస్తాలు ఫౌండేషన్ అండగా నిలిచింది. బీటెక్ చదువుతున్న షేక్ నాగూర్‌బాజీకి హాస్టల్ ఫీజు నిమిత్తం ఫౌండేషన్ గౌరవాధ్యక్షురాలు మామిళ్లపల్లి విజయలక్ష్మి శనివారం రూ.28 వేలకుగాను చెక్కు అందజేశారు. సంస్థ ప్రతినిధి తాయి కరిముల్లాబాబు మాట్లాడుతూ షేక్ నాగూర్‌బాజీ ప్రతిభతో బీటెక్‌లో ఉచిత సీటు సాధించాడన్నారు. తల్లిదండ్రులు ఇప్పటికే అతనికి రూ.80 వేలు సాయం చేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కళాకారుడికి జాతీయ పురస్కారం



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన వర్ధమాన రంగస్థల పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్‌కు విశ్వవిఖ్యాత నట రత్న నందమూరి తారక రామారావు జాతీయ పురస్కారం ప్రదానం చేశారు. తెలుగు వెలుగు సాహితీ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ త్యాగరాయ గాన సభ నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు అందించారు. రవికుమార్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

పరివర్తన పాఠశాలకు చేయూత



సత్తెనపల్లి: పట్టణంలోని పరివర్తన చెవిటి, మూగ మానసిక దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలకు ఖమ్మం జిల్లా ఎరువుపాలెం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన షేర్ ద విజన్ సంస్థ చేయూత ఇచ్చింది. మూడు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులు, సీలింగ్ ఫ్యానులు, బ్యాగులు, నోట్ పుస్తకాలు, టేబుల్ ఫ్యాన్లు, మిక్సీ, గీజర్, తదితర వస్తువులు శనివారం అందించారు. షేర్ ద విజన్ నిర్వాహకుడు నారాయణ ఆధ్వర్యంలో వీటిని అందజేశారు. ముఖ్య అతిథిగా సత్తెనపల్లి రూరల్ సీఐ పిన్నమరాజు కిరణ్ మాట్లాడుతూ పరివర్తన లాంటి సంస్థలకు ప్రతి ఒక్కరూ చేయూత అందించాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసు సిబ్బంది రాఘవరెడ్డి, రవీంద్ర, రాజేష్, నాగిరెడ్డి, మల్లికార్జునరావు, పరివర్తన నిర్వాహకుడు కిషోర్‌బాబు, తదితరులు ఉన్నారు.

డెంగీపై అవగాహన కల్పించాలి



రెంటచింతల: డెంగీపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మలేరియా నివారణ అధికారి సీహెచ్ అంకమ్మరావు పేర్కొన్నారు. మలేరియా నివారణ మసోత్సవాల్లో భాగంగా శనివారం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్టారెడ్డి నేతృత్వంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా అంకమ్మరావు మాట్లాడుతూ ఆరోగ్య, ఆశ కార్యకర్తలు జూలై 30వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. హఠాత్తుగా వచ్చే తీవ్రమైన జ్వరం, తీవ్ర తల నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, ఆకలి మందగించటం, చర్మంపై దద్దుర్లు, కనుగుడ్డును కదపలేనంతగా కళ్ళు నొప్పి వంటి లక్షణాలు డెంగీ వ్యాధి లక్షణాలుగా గుర్తించి వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం ఇళ్ల పరిసరాలను, నీటి తొట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వి.ప్రదీప్ కుమార్‌రెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ ఎ.ఆంజనేయులు, ఫార్మాసిస్ట్ మౌనిక, హెల్త్ అసిస్టెంట్ ఖాసిం, మార్తమ్మ పాల్గొన్నారు.

కవి కమలారామ్‌కు అవార్డు

వినుకొండ: సాహితీ రంగంలో తను చేసిన సేవలను గుర్తించి శనివారం హైదరాబాదు త్యాగరాయగాన సభలో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఎన్టీ రామారావు పురస్కారాన్ని కమలారామ్ శనివారం అందుకున్నారు. పట్టణానికి చెందిన జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు, జాషువా సమాఖ్య గౌరవ అధ్యక్షులు, రచయిత అయిన కమలారామ్ కి అందించడం జరిగిందని తెలుగు వెలుగు సాహితీ వేదిక సంస్థ జాతీయ అధ్యక్షులు రాజకుమార్, జాతీయ కార్యదర్శి నాగరాజు, గంగాశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ అవార్డు తోపాటు గోల్డ్ మెడల్, శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగిందని వారు తెలిపారు.

మొక్కుబడిగా ‘పొలం పిలుస్తోంది’!

- అధికారుల్లో కనిపించని శ్రద్ధ
- ఆసక్తి చూపని అన్నదాతలు
- ఫొటోలకే పరిమితమైన కార్యక్రమం
- నిర్లక్ష్యంతో అసలు లక్ష్యాలకు గండి

వ్యవసాయంలో మెలకువలు, సలహాలు అందిస్తూ లాభసాటిగా చేసేందుకు చేపట్టిన ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెబుతున్న దీనిపై అధికారులే శ్రద్ధ చూపడం లేదు. దీంతో రైతుల నుంచి కూడా స్పందన కరువైంది.



ఇరుకుపాలెంలో ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు

ముప్పాళ్ళ: సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు అమలు చేస్తూ రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అయితే అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఊసే లేకుండా చేస్తున్నారు. వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, మత్స్య శాఖ, వాటర్‌షెడ్ అధికారులు, పట్టు పరిశ్రమ, పశుసంవర్ధక శాఖ, ఆత్మ తదితర అధికారులు హాజరుకావాల్సి ఉంది. ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలి. అనంతరం 12 గంటల వరకు నిపుణులు, శాస్త్రవేత్తలను పిలిపించి రైతులతో ముఖాముఖిలో మాట్లాడించాలి. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎంపిక చేసిన గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను చూడాలి. ఆ తర్వాత 5.30 గంటల వరకు సమావేశాన్ని ఏర్పాటు చేసి అన్నదాతల సందేహాలను నివృత్తి చేయాల్సి ఉంటుంది. వ్యవసాయంలో నూతన సాంకేతిక సలహాలు, సంక్షేమ పథకాలు, ఎరువులు, నాణ్యమైన విత్తనాలు, అధిక దిగుబడిపై రైతులను చైతన్యపరచాలి.

అంతా మొక్కుబడే

ప్రతి మండలంలో కనీసం రెండు, మూడు శాఖల అధికారులు కూడా కార్యక్రమానికి హాజరు కావటం లేదు. దాని అనుబంధ శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ఎప్పుడో ఒకసారి అరకొరగా పాల్గొంటూ కార్యక్రమాన్ని మమ అనిపిస్తున్నారు. దీంతో వ్యవసాయంలో నూతన సాంకేతిక సలహాలు, సూచనలు, తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి, ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ వంటివి అన్నదాతలకు చేరడం లేదు. వర్షాలు కురవక పంటలు వేయాలా వద్దా అనే ఆందోళనలో ఉన్న రైతాంగానికి భరోసా కల్పించాల్సిన వ్యవసాయశాఖ ఆ దిశగా తీసుకున్న చర్యలు మాత్రం కనిపించడం లేదు. దీంతో రైతుల్లో కూడా కార్యక్రమంపై ఆసక్తి తగ్గింది.

వైఎస్సార్‌సీపీ హయాంలో భేష్...

వారంలో ప్రతి మంగళవారం, బుధవారం ఈ కార్యక్రమాన్ని అమలు చేయాల్సి ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో కార్యక్రమం నిర్వహించి అక్కడే ఉన్న పొలాలను సందర్శించి పలు సూచనలు చేసేవారు. రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం జరిగేది. నేడు ఒక రోజుకే పరిమితం చేశారు. రైతు భరోసా కేంద్రాల్లోనే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించి సాగు పెంచేలా చర్యలు చేపట్టారు. ఆ దిశగా వ్యవసాయం లాభదాయకంగా చేశారు. ఈ కార్యక్రమం సీజన్లో మూడు నెలలపాటు కార్యాచరణ రూపొందించి అమలు చేసేలా ప్రణాళికలు తయారు చేసుకుంటారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్లక్ష్యం

మండలంలోని వారంలో రెండు గ్రామాల చొప్పున పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించాల్సి ఉంది. కానీ అధికారుల తీరుతో రైతులు కూడా ఐదు నుంచి పది మందిలోపే హాజరయ్యే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం నిర్వహిస్తున్న అరకొర కార్యక్రమాలకు కూడా రైతుల నుంచి స్పందన కొరవడింది. రైతులు లేకుండానే ప్రదర్శన క్షేత్రాలు నిర్వహిస్తున్నట్లు రికార్డుల్లో రాసుకుంటున్నారు తప్ప ఆచరణలో ఏమీ జరగడం లేదు. మంగళవారం ఇరుకుపాలెం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు ఇద్దరు, మరో ఆరుగురు రైతులు పాల్గొనడం ఇందుకు ఉదాహరణ.

నిర్వహణ నిధులు వృథా...

ఒక రోజు సమావేశం నిర్వహణకుగాను రూ.1,500, ఫ్లెక్సీ తయారీకి రూ.150, మైకులు, తేనీరు రు.1,000, మండలానికి కరపత్రాల ముద్రణకు రూ.5,000 చొప్పున నిధులు అందిస్తున్నారు. ఇంత ఖర్చు పెడుతున్నా రైతులకు ఉపయోగపడేలా కార్యక్రమాలు నిర్వహించకపోవడంతో ఇదంతా వృథా అవుతోంది. ఇకనైనా ఉన్నత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

‘అన్నదాత సుఖీభవ’పై నిలదీతలు

‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమాలకు వెళుతున్న అధికారులకు రైతుల నుంచి అన్నదాత సుఖీభవ అమలుపైనే ప్రశ్నలు వస్తున్నాయి. ప్రభుత్వం నుంచి సబ్సిడీ యంత్రాల ఎప్పుడు అందిస్తారని అడుగుతున్నారు. ఏదో సాకు చెప్పి తప్పించుకోవడం అధికారుల వంతు అయింది. గ్రామాల్లోకి వెళ్లాలంటే వ్యవసాయాధికారులకు ముచ్చెమటలు పడుతున్నాయి. వ్యవసాయ శాఖతోపాటుగా దాని అనుబంధ శాఖలు ప్రచురించిన కరపత్రాలతో ప్రయోజనం శూన్యంగా మారింది. ప్రజాధనం దుర్వినియోగమే తప్ప తమకు అదనంగా ఒరిగిందేమీ లేదని రైతులు పెదవి విరుస్తున్నారు.

మందకృష్ణ మాదిగ సన్మాన సభకు తరలిరండి

సత్తెనపల్లి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు వచ్చిన సందర్భంగా ఈ నెల 13వ తేదీన ఏపీ ఎస్సీ, ఎస్టీ, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జేఏసీ ఆధ్వర్యంలో తాడేపల్లిలో జరగనున్న సన్మాన సభను విజయవంతం చేయాలని జేఏసీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు చిలుకా భాస్కర్ శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కోరారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, ఎంప్లాయిస్ అందరూ హాజరు కావాలన్నారు. అసోసియేషన్ సీనియర్ నాయకులు చిలుకా జాన్సన్, గరికపాటి హిట్లర్, వి.వి జయవర్ధన్, జొన్నలగడ్డ ఫణిదాస్, సాలిపోగు రమేష్, కలపాల ప్రేమ్‌కుమార్, చిలుకా రమణయ్య తదితరులు ఉన్నారు.

కుందురువారిపాలెంలో ‘తొలి అడుగు’

కుందురువారిపాలెం (ముప్పాళ్ళ): మండలంలోని కుందురువారిపాలెం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం శనివారం జరిగింది. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్, డా.కోడెల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, నాయకులు దరువూరి నాగేశ్వరరావు, కళ్లం వీరభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు మాయం

చిలకలూరిపేటటౌన్: జగనన్న కాలనీలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలపై ఉన్న తీగలు చోరీకి గురయ్యాయి. మండలంలోని గుదేవారిపాలెం గ్రామం సమీపాన ఉన్న జగనన్న కాలనీలో నివాసితుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలపై ఉన్న తీగలు గుర్తు తెలియని దుండగులు అపహరించుకుని పోయారు. విషయం తెలుసుకున్న చిలకలూరిపేట విద్యుత్‌శాఖ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు 15 కిమీ మేర పొడవైన తీగలు చోరీ అయ్యాయంటూ శనివారం ఇచ్చిన తమ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇంటి స్థలానికి దరఖాస్తు చేసుకోండి

రొంపిచర్ల: మండలంలోని గ్రామాల్లో సొంత ఇల్లు, ఇంటి స్థలం లేని నిరుపేదలు వారికి దగ్గర్లోని గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ బి. నిర్మల శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుతో పాటు రేషన్ కార్డు జిరాక్స్, ఆధార్ కార్డు, ఓటరు ఐడీ, పాస్‌పోర్ట్ ఫొటోలు అందజేయాలని తెలిపారు. గతంలో ప్రభుత్వం నుంచి ఇల్లు కాని, ఇంటి స్థలం కాని పొందని వారు దరఖాస్తుకు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని నిరుపేదలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సాగుదారులందరూ సకాలంలో కౌలు చెల్లించాలి

రెంటచింతల: సత్రశాల దేవస్థానం భూములను ఆక్రమించుకుని సాగుచేస్తున్న వారందరూ సకాలంలో కౌలు చెల్లించి సహకరించాలని దేవదాయశాఖ ఈఓ గాదె రామిరెడ్డి కోరారు. శనివారం దుర్గి మండలంలోని అడిగొప్పులలో సర్వే నంబర్ 421లో ఉన్న 11.65 ఎకరాల మాగాణి భూములను గత 30 ఏళ్లగా సాగుచేసుకుంటున్న రైతులు, రైతుకూలీ సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెంటచింతల ఈఓ రామిరెడ్డి మాట్లాడుతూ పూర్తిగా సహకరించాలని కోరారు. సమావేశంలో ఈఓలు హనుమంతరావు, సైదయ్య, శివనాగిరెడ్డి పాల్గొన్నారు.

చిరు వ్యాపారులపై ‘పచ్చ’ ప్రతాపం

- నిర్ధాక్షిణ్యంగా 15 దుకాణాలు తొలగింపు
- అన్న క్యాంటీన్ సమీపంలో ఘటన
- బస్ షెల్టర్ ఏర్పాటు చేస్తామంటూ హడావుడి
- తమ పొట్టగొట్టారని వ్యాపారుల ఆక్రందన
- ప్రత్యామ్నాయం కూడా చూపలేదని ఆవేదన





దుకాణాలు తొలగిస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: రోడ్డు పక్కన చిరు వ్యాపారులు చేసుకునే వారిపై పచ్చ నేతలు తమ ప్రతాపం చూపారు. ఎంతోకాలంగా రోడ్లపైనే వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, తమ పొట్టలు కొట్టొద్దంటూ చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని తాలూకా సెంటర్‌లో అన్న క్యాంటీన్ పక్కన చిరు వ్యాపారులు 24 ఏళ్లుగా తడికలతో చిన్న చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకుని పండ్లు విక్రయిస్తూ జీవనం వెళ్లదీస్తున్నారు. శుక్రవారం రాత్రి దుకాణాలు కూల్చి వేసేందుకు టీడీపీ నేతలు తొలగింపజేశారు. తాము ఎలా బతకాలంటూ చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేసినప్పటికీ పట్టించుకోలేదు. నిర్ధాక్షిణ్యంగా దుకాణాలను తొలగింపచేశారు. దీంతో వ్యాపారులు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. టీడీపీ నేతల తీరుపై విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లేందుకు 15 మంది చిరు వ్యాపారులు పయనమయ్యారు. మంగళగిరిలో మంత్రి లోకేష్‌ను కలిసేందుకు ప్రయత్నిస్తే ఆయన అందుబాటులో లేకపోవడంతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీనిపై తాను మాట్లాడి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులు మాట్లాడుతూ కనీసం ప్రత్యామ్నాయం కూడా చూపకుండా అర్ధాంతరంగా దుకాణాలను తొలగించడంతో తాము రోడ్డున పడ్డామని వాపోయారు.

బస్సు షెల్టర్ పేరుతో తొలగింపు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా చెప్పుకోదగిన అభివృద్ధి పనులు ఒక్కటి కూడా సత్తెనపల్లిలో జరుగలేదు. గతంలో చేసిన వాటికి ప్రారంభోత్సవాలు చేయడం తప్ప. నూతనంగా చేపట్టిందేమీ లేదు. కానీ రోడ్ల పక్కన తామేదో చేశామనే గొప్పల కోసం పేర్లు పెట్టుకునేందుకు చిన్న చిన్న పనులు చేపడుతున్నారు. దీనిలో భాగంగానే ప్రస్తుతం చిరు వ్యాపారుల దుకాణాలు తొలగించి, అక్కడ బస్సు షెల్టర్ ఏర్పాటు చేస్తామంటూ తెరపైకి తెచ్చారు. బస్సు షెల్టర్ పేరుతో 15 కుటుంబాలను ఇబ్బందులపాలు చేయడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలని కోరుతున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ విజయకుమార్

సత్తెనపల్లి: విద్యార్థులు నిషేధిత గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సర్కిల్ సీఐ పి.వి జయకుమార్ అన్నారు. పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థుల దృష్టి జీవిత లక్ష్యాలపై ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి ఎస్సై నాగలక్ష్మి మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలు అవుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ప్రతి విద్యార్థి చదువులపై దృష్టి పెట్టి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా చెడు వ్యసనాలకు దూరంగా ఉంటామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది ఖాజా, ఆనంద్, శివ, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

బైకు దొంగిలించబోయి చిక్కిన వ్యక్తి

యడ్లపాడు: బైక్ చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బోయపాలెం గ్రామంలో రామాలయం వీధిలో శుక్రవారం అర్ధరాత్రి వీధి కుక్కల అరుపులు ఎక్కువగా ఉండటంలో స్థానికులు లేచి గమనించారు. అప్పటికే ఓ బైక్‌కు తాళం తీస్తూ ఓ వ్యక్తి కనిపించడంతో కేకలు వేశారు. వెంటనే అతను పరారు కావడం గమనించి పరుగున వెళ్లి పట్టుకున్నారు. అతన్ని పట్టుకుని ఆరా తీయగా బైక్ తాళం తీస్తుండగా తాళం విరిగిపోయిందని గ్రహించారు. దీంతో సమాచారం పోలీసులకు తెలిపి అతన్ని అప్పగించినట్లు తెలిపారు. అయితే ఇదే వీధిలో గతంలో రెండు ద్విచక్ర వాహనాలు అపహరణకు గురినట్లు స్థానికులు చెబుతున్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం బలోపేతానికి చర్యలు



సమావేశంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘాల నాయకులు

పిడుగురాళ్ల: పట్టణంలోని మిలిటరీ కాలనీలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం పల్నాడు జిల్లా ముఖ్య నాయకులు సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశం పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు వంగూరి అశోక్‌కుమార్ మాదిగ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా చందోలు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... పాఠశాలలకు ప్రభుత్వం సన్న బియ్యం ఇవ్వడం సంతోషిదాయకమని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఐఆర్, డీఏ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం పల్నాడు జిల్లా నూతన అధ్యక్షుడిగా కుంభ వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శి వంగూరి అశోక్‌కుమార్, ఆర్థిక కార్యదర్శిగా రమావతు రక్కు నాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా అధ్యక్షులు కుంభ వీరాంజనేయులు, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి వడితే రాజు నాయక్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారులు పుల్లి ప్రభుదాసు, వడితే రాజునాయక్, కారసాల విజయబాబు, ఎంపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాగిడి కోటేశ్వరరావు, పేరం సాంబశివరావు, అంగడి అశోక్‌కుమార్, కూచిపూడి శ్యామ్, దిలీప్ నాయక్ పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక



ప్రెసిడెంట్ జయప్రకాష్, విజయ సుశీలను సన్మానిస్తున్న పాస్టర్లు

మాచర్ల రూరల్: పల్నాడు డిస్ట్రిక్ట్ పాస్టర్స్ ఫెలోషిప్ నేతృత్వంలో మాచర్ల నియోజకవర్గం, మండల, పట్టణ నూతన కమిటీలను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫౌండర్, ప్రెసిడెంట్ బిషప్ డాక్టర్ గంజికుంట జయప్రకాశ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ డైరెక్టర్ వేల్పుల దానియేలు, గౌరవాధ్యక్షులు ఉప్పుతోళ్ళ మార్కు, పసల రాజా, పాత నాగేశ్వరరావు నేతృత్వంలో ఎన్నిక నిర్వహించారు. స్థానిక ఏసు దీవించును ప్రార్థనా మందిరంలో ఆత్మీయ సమావేశంలో గౌరవాధ్యక్షులు డాక్టర్ ఆదూరి మాణిక్యరావు, దేవుని వాక్యాన్ని అందించగా బిషప్ జయప్రకాశ్ మాట్లాడుతూ ఫెలోషిప్‌కు సేవకులపై ఉన్నటువంటి బాధ్యతలను తెలిపి ఐక్యంతో ముందుకు సాగాలని కోరారు. సమావేశంలో మాచర్ల నియోజకవర్గ అధ్యక్షుడిగా రెవ.అహరోను, పట్టణ అధ్యక్షుడిగా రెవ.బి.టైటస్, మాచర్ల రూరల్ అధ్యక్షుడిగా రెవ.ఎ.చిన కోటయ్య, వెల్దుర్తి మండల అధ్యక్షుడిగా రెవ. ఎ.గురవయ్య, కారంపూడి అధ్యక్షుడిగా రెవ.ఇ. కృపారావు, రెంటచింతల అధ్యక్షుడిగా రెవ.డి.ప్రభుదాస్ ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికైన సభ్యులను దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు.

అవినీతి సొమ్ము ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రికవరీ

- జిల్లా ఉపాధి పీడీ సిద్ధా లింగమూర్తి
- కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఉందంటూ పలువురు విమర్శలు



శావల్యాపురం: ప్రజావేదిక కార్యక్రమంలో సోషల్ ఆడిట్ టీం విచారణ చేయగా రూ.3.21 లక్షల అవినీతి జరిగినట్లు గుర్తించినట్లు, వాటిని ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రికవరీ చేయాలని జిల్లా ఉపాధి పీడీ సిద్ధా లింగమూర్తి ఆదేశించారు. ఆడిట్‌పై విచారణ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో రూ. 1.35 కోట్ల నగదు ఆయా పనులకు సంబంధించి ఉపాధి పథకం ఏపీడీ సారథ్యంలో మళ్లీ పునఃవిచారణ చేస్తామన్నారు.

అధికారుల తీరుపై తీవ్ర వ్యతిరేకత

గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతో సోషల్ ఆడిట్ సభ్యులు విచారణ చేసి సేకరించిన అంశాలను నివేదిక రూపంలో ప్రజావేదిక కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో చదివి వినిపించాలి. వ్యత్యాసాలు ఉన్నవన్నీ గుర్తించి రికవరీ అధికారులు చేయించాల్సి ఉంది. అయితే అందుకు భిన్నంగా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రజావేదికలో సోషల్ ఆడిట్ బృందాలు ఇచ్చిన నివేదికపై కూడా పునఃపరిశీలన చేస్తామని జిల్లా ఉపాధి అధికారి స్వయంగా చెప్పటం విశేషం. ప్రజావేదికలో తేటతెల్లమైన అవినీతిని పట్టించుకోకుండా సోషల్ ఆడిట్ బృందాల పనితీరు తప్పు పట్టే విధంగా ఈ వైఖరి ఉందని ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. ఉపాధి పనుల్లో అవినీతిని వెలికి తీసేందుకే కేంద్రం ఏర్పాటు చేసిన సోషల్ ఆడిట్ సభ్యులు చేస్తున్న పనిని అధికారులు అడ్డుకుంటున్నారని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతిని కప్పిపుచ్చేందుకు ఉన్నతాధికారులు నామమాత్రంగా ప్రజావేదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జరిగిన అవినీతిని గుర్తించి ప్రజాధనాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ప్రజలు భావిస్తున్నారు.

ఎంఏఎం కళాశాలలో స్నాతకోత్సవం

నరసరావుపేట రూరల్: ఫార్మసీ అనేది వృత్తి మాత్రమే కాదని ఒక సేవా రంగం అని ఎంఏఎం ఫార్మసీ కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు తెలిపారు. కళాశాలలో శనివారం స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రామశేషగిరిరావు, ప్రముఖ మనస్తత్వవేత్త డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, రిటైర్డ్ ఆంధ్రాబ్యాంక్ మేనేజర్ కోయ రామారావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ మందుల తయారీ, వాటి ప్రభావం, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం వంటి బాధ్యతలు ఫార్మసీ విద్యను పూర్తిచేసి కొత్త దశలోకి అడుగుపెడుతున్న విద్యార్థులపై ఉందని తెలిపారు. ఫార్మసీ రంగంలోకి ప్రవేశిస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సేవ చేయబోతున్నారని తెలిపారు. పరిశ్రమలోకి వెళ్లినా, క్లినికల్ ఫార్మసీలోకి పనిచేసినా, అధ్యాపక రంగంలోకి ప్రవేశించినా నిజాయితీ, కర్తవనిష్టతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రామారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



స్నాతకోత్సవంలో పాల్గొన్న అతిథులు, అధ్యాపకులు